క్లుప్తంగా

కలెక్టర్‌కు అవార్డు



నెల్లూరు(అర్బన్) : రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆనంద్‌కు అవార్డు వరించింది. విజయవాడ రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా దీనిని అందజేశారు.

సన్మానం



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సభను చేజర్ల వినయ, పూనూరు శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.గిరిజాలక్ష్మి మాట్లాడుతూ దివంగత పీవీ రమణారెడ్డి గత 50 ఏళ్లుగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బత్తిన సాయికుమార్‌రెడ్డిని నిర్వాహకులు సన్మానించారు. చంద్రలత, గోవిందరాజు సుభద్రాదేవి పాల్గొన్నారు.

జేసీకి అదనపు బాధ్యతలు

నెల్లూరు(బారకాసు) : జేసీ కార్తీక్‌కు నుడా వైస్ చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 17వ తేదీ వరకు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ నుడా వైస్ చైర్మన్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన బదిలీ కావడంతో జేసీ కార్తీక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

వెబ్‌సైట్‌లో పది షార్ట్ మెమోలు

నెల్లూరు (టౌన్) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి షార్ట్ మెమోలు అందుబాటులో ఉంచినట్లు డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వారి లాగిన్ నుంచి షార్ట్ మెమోలు అప్‌లోడ్ చేసి వారి సంతకం చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. మార్కులు జాబితాలో ఏమైనా కరెక్షన్స్ గుర్తించినట్లయితే సంబంధించిన ఆధారాలతో ఈనెల 25వ తేదీలోపు పంపాలన్నారు.

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు 60 ప్రత్యేక బస్సులు

నెల్లూరు సిటీ : పెంచలకోనలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు నెల్లూరు ఆర్టీసీ రీజియన్ నుంచి 60 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి మురళీబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11, 12వ తేదీల్లో ప్రత్యేక బస్సులు ఉంటాయన్నారు. నెల్లూరు-1 డిపో నుంచి పది బస్సులు, రాపూరు నుంచి 15, వెంకటగిరి నుంచి 10, గూడూరు నుంచి 10, ఆత్మకూరు నుంచి 10, పొదలకూరు నుంచి ఐదు బస్సుల చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు.

థర్మల్ విద్యుత్ కేంద్రంలో మాక్‌డ్రిల్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదలకూరు(ముత్తుకూరు): ముత్తుకూరు మండలం నేలటూరులోని దామోదర సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో గురువారం ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఆరోగ్య శాఖల అధికారులు దీనిని చేపట్టారు. ప్లాంట్ ఆవరణలో బాంబుల దాడి జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?, క్షతగాత్రులను వైద్య సేవలకు కోసం ఎలా తరలించాలి? తదితర అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసులు, తహసీల్దార్, ఎంపీడీఓ, జెన్‌కో సీఈఓ, పోర్ట్ సీఐ, ఎస్సై, ఫైర్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

కొరుటూరులో బైక్ చోరీ

ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరుకు చెందిన రంతుల్లా పల్సర్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీ చేశారు. రంతుల్లా రోజులాగే బైక్‌ను ఇంట్లో ఉంచి మిద్దెపైన నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గత నెల కూడా గ్రామంలో ఓ పల్సర్ బైక్, అంతకు ముందు మరో పల్సర్ బైక్ అపహరణకు గురైంది. ఎప్పుడూ లేనివిధంగా వరుసగా పల్సర్ బైక్‌లు చోరీ కావడం చర్చనీయాంశంగా మారింది.

వేసవిలో కూల్‌కూల్‌గా..

- తాటి ముంజలకు భలే గిరాకీ
- మెండుగా పోషకాలు
- నగరంలో విస్తృతంగా విక్రయాలు



నగరంలో జోరుగా సాగుతున్న తాటి ముంజల విక్రయాలు

నెల్లూరు(బారకాసు) : తాటి ముంజలు వేసవి సీజన్లో మాత్రమే దొరికే పల్లెటూరి మధురాలు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, కూల్‌డ్రింక్స్, కొబ్బరిబోండాలు ఉన్నా ముంజలదే మొదటి స్థానం. సూర్యప్రతాపాన్ని తట్టుకునేందుకు మానవునికి కావాల్సిన పోషక పదార్థాలు పుష్కలంగా ఉండటంతో దీనికి భలే గిరాకీ ఏర్పడింది. వీటిపై ప్రజలు ఆసక్తి చూపడంతో ముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. తాటిచెట్ల నుంచి దించిన గెలలను అలాగే తీసుకొచ్చి తాజాగా అప్పటికప్పుడు కాయలు కొట్టి ముంజలను తీసి విక్రయిస్తున్నారు. గతంలో చాలా తక్కువ ధరకు లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒకప్పుడు గ్రామాల్లో ఎక్కడ చూసినా పొలాల గట్లపై వరుసగా తాటి చెట్లు కనిపించేవి. ఇప్పుడు ఎక్కడో కొన్ని ప్రాంతాల్లోనే దర్శనమిస్తున్నాయి.

జోరుగా..

నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు, సంతపేట, చిన్నబజార్, మినీబైపాస్‌రోడ్డు, ముత్తుకూరు రోడ్డు సెంటర్ తదితర ప్రాంతాల్లో తాటి ముంజలను విక్రయిస్తున్నారు. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాలైన రాజుపాళెం, పొదలకూరు, చేజర్ల, ఆత్మకూరు, బుచ్చి, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల నుంచి గ్రామీణులు తాటి ముంజలను నగరంలోకి తీసుకొచ్చి విక్రయిస్తూ అనేక పేద కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

పోషక విలువల్లో మేటి

వంద గ్రాములు తాటి ముంజలో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాములు కార్బోహైడ్రేట్లు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచుపదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 0.061 గ్రాముల ఆమ్లం, 12 మి.లీల కాల్షియం, 21 మి.లీల పాస్పరస్, 0.2 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటాయి. సీజన్‌లో దొరికే తాటిముంజలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

- ఆనం విజయకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి కోరారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో 24, 25 డివిజన్ల పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం 24వ డివిజన్ ఇన్‌చార్జిగా ఆదిశేషారెడ్డిని, 25వ డివిజన్ ఇన్‌చార్జిగా ఖాదర్‌బాషాను నియమిస్తూ ప్రకటించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం కార్యదర్శి శ్రీమతి వెంకట్‌జ్యోతి, రూరల్ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు కసకట్ల మోహన్‌రావు ముదిరాజ్, మేధావి విభాగం అధ్యక్షుడు చంద్రమౌళి పాల్గొన్నారు.

కార్మికులకు బెనిఫిట్స్ కల్పించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నేతలు

నెల్లూరు(బారకాసు): 60 సంవత్సరాలు నిండిన మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నాలుగో రోజైన గురువారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నందిపాటి మాలకొండయ్య, పి.సూర్యనారాయణ మాట్లాడుతూ 60 సంవత్సరాల వయసు నిండిందంటూ కార్మికులకు ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా, పనులకు ఆపడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించి, బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మేయర్ పొట్లూరి స్రవంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, మున్సిపల్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, నాయకులు ఎండీ గయాస్, కామాక్షమ్మ, సుజాతమ్మ, వజ్రమ్మ, శ్రీనివాసులు, సలోమి, బుజ్జమ్మ, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నేత కొలను సుధీర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చింతారెడ్డిపాళెంలోని విజయకుమార్‌రెడ్డి నివాసంలో ఈ మేరకు పార్టీ కండువా కట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆనం విజయకుమార్‌రెడ్డి నాయకత్వం మీద నమ్మకంతో స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మురళి యాదవ్, ప్రకాష్, వడ్లపూడి పెంచలయ్య, గడి నాగరాజు, ప్రేమ్‌కుమార్, వెంకయ్య, రామచంద్రారెడ్డి, ఖాదర్‌బాషా, పొన్నవోలు జగన్‌మోహన్‌రెడ్డి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

25న యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఈనెల 25న కొండాయపాళెంలోని యాదవ భవన్‌లో యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన నగరంలోని రాధే గెస్టిన్‌లో యాదవ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. పదో తరగతిలో 470కు పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని వివరించారు. ఇతర వివరాలకు 97058 00794, 95731 05305 సంప్రదించాలని కోరారు. రామచంద్రయ్య, మధుసూదనరావు, నాగకిశోర్, హరిబాబు, సురేష్, బాలరాగయ్య, దినేష్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బందికి బహుమతులు

నెల్లూరురూరల్ : 2024-25 ఆర్థిక సంవత్సరానికి నెల్లూరు పోస్టల్ డివిజన్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులను పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అందజేశారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం జరిగిన సమావేశానికి విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్ వీఆర్ మూర్తి హాజరై బహుమతులు అందించారు.

రోలర్ స్కేటింగ్‌లో ఉచిత శిక్షణ

నెల్లూరు(బృందావనం) : ఆదిత్య నగర్ చిల్డ్రన్స్ పార్క్‌లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి రోలర్ స్కేటింగ్ శిక్షణా తరగతులు జరుగనున్నాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, కె.కామేష్ గురువారం తెలిపారు. శిక్షణకు 6 నుంచి 16 ఏళ్లవారు అర్హులన్నారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షకులు విశ్వనాథ్ (94400 59500), షౌకత్ అలీ (80192 23661) నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానం పునర్నిర్మాణం సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

లాడ్జిలో అనధికార మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఓ లాడ్జిలో అనధికార మద్యం విక్రయాలు సాగిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏఎస్‌పేట మండలానికి చెందిన పి.రాధాకృష్ణ రెండేళ్ల కిందట నెల్లూరుకు వచ్చారు. ఏడాదిగా ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ సమీపంలోని డీఎంకే లాడ్జిని లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నారు. అయితే నిర్వహణకు సరిపడా నగదు రాకపోవడంతో లీజు చెల్లించడం కష్టతరంగా మారింది. దీంతో ఆయన నగరంలోని వివిధ షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి లాడ్జికి వచ్చే కస్టమర్లకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. దీనిపై చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావుకు పక్కా సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై అబ్దుల్ రజాక్ తన సిబ్బందితో గురువారం లాడ్జిపై దాడిచేశారు. రాధాకృష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 39 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురస్కారాల ప్రదానోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం) : గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక ఆధ్వర్యంలో మాగుంట లేఅవుట్‌లోని డాక్టర్ విశ్వసాయి స్కూల్ ఏసీ హాల్లో ఉదయం 9 గంటలకు 'గోవిందరాజు సీతాదేవి జాతీయస్థాయి సాహితీ పురస్కారం 2024' ప్రదానోత్సవ సభ శనివారం జరుగనుందని సంస్థ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి గురువారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి కవులు, రచయితలు పాల్గొంటారని వివరించారు.

భక్తిశ్రద్ధలతో సంస్మరణోత్సవాలు



గానం చేస్తున్న వినోద్‌కుమార్

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో సంస్మరణోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం శంకరభగవత్పాదుల వారి పాదుకార్చనలు నిర్వహించారు. గుంటూరు శృంగేరి విరూపాక్ష శ్రీపీఠ పీఠాధిపతుడు గంభీరానంద భారతి స్వామిచే భాష్య ప్రవచనం, విద్వాన్ వినోద్‌కుమార్‌చే సంగీత విభావరి నిర్వహించగా వీరాస్వామి(తబల), జయప్రకాష్ (కీబోర్డు) వాద్యసహకారం అందించారు. చక్రాలవారి ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, చక్రాల ఆనంద్‌కుమార్, ఎం.ఉదయ్‌కుమార్‌శర్మ, టి.లక్ష్మీనారాయణ, జి.జయచంద్ర, పి.నరసింహారావు, నాగరత్నకుమారి, పాలేటి చాయాకుమారి పర్యవేక్షించారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్) : తూనికలు, కొలతలకు సంబంధించి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఇసాక్ తెలిపారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులకు తూనికలు, కొలతలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు బరువు, తూకాలు, కొలతల నిబంధనలు, సరైన ప్రమాణ పరికరాల వినియోగం గురించి వివరించారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఆశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్, సేటిల్ కంపెనీ నుంచి నాగేశ్వరరావు, కోశాధికారి గపూర్ పాల్గొన్నారు.

సేవకు మారుపేరు రెడ్‌క్రాస్



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా నేతలు

నెల్లూరు(అర్బన్) : సేవకు మారుపేరుగా రెడ్‌క్రాస్ సొసైటీ నిలుస్తోందని ఆశాఖ జిల్లా కోశాధికారి సురేష్‌కుమార్ జైన్ అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఉద్యమానికి కారణమైన హెన్రీడ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మానవత్వం చాటేలా వలంటీర్లు, సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య మాట్లాడుతూ 15 ప్రాజెక్టులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు మజ్జిగ, తాగునీరు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంసీ మెంబర్ రాజేంద్రప్రసాద్, స్వాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు, మెడికల్ ఆఫీసర్ వరప్రసాద్, సాయిరామ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

- కమిషనర్ నందన్



వైఎస్సార్ నగర్‌లో తాగునీటి సమస్యలపై ఆరాతీస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని డివిజన్లలో వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 30వ డివిజన్ వైఎస్సార్ నగర్, మల్లయ్యగుంట, కేంద్రీయ విద్యాలయం, జర్నలిస్టు కాలనీ ప్రాంతాల్లో కమిషనర్ గురువారం పర్యటించారు. తాగునీటికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని డివిజన్లలో చేతిబోర్ల పనితీరును పరిశీలించి, అవసరమైన వాటికి రిపేర్లు చేయించాలని సూచించారు. చేతిబోర్ల మరమ్మతులకు అవసరమైన స్పేర్ పార్ట్స్, అదనపు సిబ్బందిని నియమించుకుని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అన్ని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు వాటి కెపాసిటీకి తగినట్లుగా నిండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ నగర్ పరిధిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న కారణంగా ట్యాంకర్ల సరఫరా చేపట్టాలన్నారు. మల్లయ్యగుంటలో రోడ్లు, డ్రెయిన్ కాలువల నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం 37వ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, పబ్లిక్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే 17వ డివిజన్ ఆకుతోట ప్రాంతంలోని డీఎస్కే గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఖాళీ స్థలాలు, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారి శేషగిరిరావు, ఏఈ అర్పిత పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో నేమ్‌బోర్డుల ఏర్పాటు



నేమ్‌బోర్డులను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి(సర్వజన ఆస్పత్రి)లో ప్రతి వార్డు, డాక్టర్ల రూములు, ల్యాబొరేటరీ, ప్రొఫెసర్లు ఉండే ప్రదేశం ఇలా అన్ని ప్రాంతాల్లో నేమ్‌బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు.

కాలువలో వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న జేసీబీ, సిబ్బంది

నగరంలోని కరెంటాఫీస్ సెంటర్ మారుతి షోరూమ్ వద్ద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది గురువారం తొలగించారు. 'పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం వచ్చిన కథనానికి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈ క్రమంలో జేసీబీతో వ్యర్థాల తొలగించి, మురుగునీరు సజావుగా పారేలా చర్యలు తీసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

కాశీవిశ్వనాథునికి శేష వాహనసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఉన్న అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథుని దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణ, రాత్రి శేషవాహన సేవ గావించారు. అర్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, వందవాసి గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజ కార్యక్రమాలు జరిపారు. ఈఓ జీసీహెచ్ దర్గయ్య పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారికి చంద్రప్రభ సేవ జరుగనుంది.

వేడుకగా బండాసురవధ



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి వసంతోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి బండాసురవధ ఉత్సవాన్ని కనులపండువగా చేపట్టారు. ఉభయకర్తలుగా కె.మాలకొండయ్య వ్యవహరించారు. దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

హంస వాహనంపై నృసింహుడు



నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని నరసింహకొండలో ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి గురువారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గోపి, ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.